క్లుప్తంగా

గడప గడపకూ ప్రచారం

కాంగ్రెస్‌కు రుణపడి ఉందాం

ఉప్పునుంతల/లింగాల: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌కు రుణపడి ఉందామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కోరారు. శనివారం ఆయన మండలంలోని రాయిచెడ్, తాడూరు, తిప్పాపూర్, కాంసానిపల్లి, తిర్మలాపూర్, లక్ష్మాపూర్, పెద్దాపూర్, సదగోడు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా లింగాల మండలంలోని మగ్దుంపూర్ చౌరస్తాలో ఓ హోటల్ స్థానికులతో కలిసి టీ తాగి గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, నాయకులు అనంతరెడ్డి, నర్సింహ్మారెడ్డి, నర్సింహ్మారావు, గోవర్ధన్‌రెడ్డి, తిర్పతయ్యగౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి/కోడేరు: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం కోడేరు మండలంలోని ఎత్తంలో ఇంటింటి ప్రచారం చేసి ర్యాలీ నిర్వహించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకుల అక్రమాలపై విచారణ చేయాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో జూపల్లి కృష్ణారావుకు మద్దతుగా సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

ఇంటింటి ప్రచారం

అచ్చంపేట రూరల్: మండలంలోని చేదురుబావితండా, దుబ్బతండా, ఐనోల్, శివారు తండా, కిష్ట్యాతండా, బాల్యతండా, కన్యతండా, సింగారం, చెన్నారంలో శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, నాయకులు పర్వతాలు, లోక్యానాయక్, రాజేశ్వర్ రెడ్డి, గువ్వల భాస్కర్, నాయకులు సేవ్యనాయక్, మల్లయ్య, చంద్రు, పరమేష్, శ్యామ్, సోమ్లానాయక్ పాల్గొన్నారు.

సేవకుడిగా పనిచేస్తా

కల్వకుర్తిరూరల్/వెల్దండ: నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదిస్తే సేవకుడిగా పనిచేస్తానని బీజేపీ అభ్యర్థి ఆచారి అన్నారు. జానగుట్టతండా, పలుగుతండాలలో శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా వెల్దండ మండలంలోని చెర్కూర్, భర్కత్‌పల్లి, గానిగట్టుతండా, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 30ఏళ్లుగా పార్టీలో ఉండి ప్రజలకు సేవ చేస్తున్నానన్నారు. అనంతరం ఆయా పార్టీల నాయకులు ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు, పరమేష్‌గౌడు, బాలస్వామి, జంగయ్యయాదవ్, చక్రవర్తిగౌడ్, పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బిజినేపల్లి : మండలంలోని పోలెపల్లి గ్రామానికి చెందిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు శనివారం ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ సంఘం అధ్యక్షుడు బాలస్వామి, సభ్యులు నాగయ్య, పెంటస్వామి తదితరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గంగనమోని తిరుపతయ్య, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

తెలకపల్లి: మండలంలోని బోరబండతండా, శివరాంపల్లితండా శనివారం నాగర్‌కర్నూల్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్ మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దళిత బహుజనులందరికీ సమన్యాయం, సమాన హక్కులు, అవకాశాలు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐక్యత చాటుదాం



కల్వకుర్తిరూరల్: హక్కుల సాధన కోసం ముదిరాజ్ సేవకులు ఐకమత్యంతో ముందుకు సాగుదామని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యాదగిరి, గౌరవాధ్యక్షులు రాజు అన్నారు. శనివారం పట్టణంలోని పద్మశాలీ భవనంలో నియోజకవర్గ ముదిరాజ్ సేవకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో భవిష్యత్ ప్రణాళికలను చర్చించారు. కార్యక్రమంలో శ్రీను, సుధాకర్, రామ్మూర్తి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కంది చేన్లో గంజాయి సాగు

అమ్రాబాద్: పదర మండలం ఉడిమిళ్లలోని ఓ రైతు సాగు చేస్తున్న పంట పొలంలో గంజాయి మొక్కలను గుర్తించిన పోలీసులు.. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు స్థానికులు, పోలీసుల ద్వారా తెలిసింది. గ్రామానికి చెందిన మెగావత్‌దూద్య తన కంది చేనులో అంతర పంటగా గంజాయి సాగు చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. 476 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. స్వాధీనం చేసుకున్న గంజాయి ధర రూ.47 లక్షలు ఉండవచ్చని స్థానికులు తెలియజేశారు. ఈ విషయమై కేసు నమోదు చేశారా లేదా అనే విషయమై పోలీసులను సంప్రదించగా ఎవరూ స్పందించలేదు.

మరోసారి ఆశీర్వదించండి



కుమ్మెరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: పట్టణంలో చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 12 వార్డులో ఆయన ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నియోజకవర్గం ఎలా ఉందో ప్రజలు ఒక్కసారి ఆలోచించుకోవాలన్నారు. పట్టణంలో ప్రతి వీధికి సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, మినీ ట్యాంక్‌బండ్ ఎన్నో అభివృద్ధి పనులు చేశానని వివరించారు. మరోమారు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోతీ కుమార్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు మేడిపూరు, గుంతకోడూరు, అల్లాపూర్, గ్రామాల్లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి మద్దతుగా మండల అధ్యక్షుడు రమేష్, పర్వతాలు, మశన్న తదితరులు ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

తెలకపల్లి: ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్ నాయకులు మండలంలోని గౌరారంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు సొంత ఖర్చులతో ఎమ్మెల్యే సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మర్రి జనార్ధ్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని కుమ్మెరలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను నమ్మొద్దన్నారు. గ్రామంలో అండర్ డ్రెయినేజీ, బీటీ రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌ది అమలుకాని మేనిఫెస్టో..

సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కేవలం ఓట్ల కోసమేనని, వాటి అమలు ఆ పార్టీకి సాధ్యం కాదని బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థి కనీసం ఆరు నెలలైనా ఉంటారన్న గ్యారంటీ ఎవరు ఇస్తారని ప్రశ్నించారు. తనకు టికెట్ ఇవ్వకుండా మోసం చేయడంతో బీఆర్ఎస్‌లో చేరానన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ప్రజలకు తనవంతు సేవ చేసేందుకు, వారి కలలు నెరవేర్చేందుకే తన చిరకాల మిత్రుడైన కేసీఆర్‌తో కలిశానని చెప్పారు. మార్కండేయ లిఫ్టుతో నియోజకవర్గంలోని ప్రజల కల సాకారం అవుతుందన్నారు. బిజినేపల్లి మండలం శాయిన్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన పంపు శుక్రవారం రాత్రి ప్రారంభమైందని.. తద్వారా మండలంలోని ఏడు గ్రామాల్లోని 8వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి..



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి

నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన చేయనున్నారు. మధ్యాహ్నం 2:50 గంటలకు కొల్లాపూర్‌కు హెలికాప్టర్ ద్వారా చేరుకోనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2:55కు ఎల్లూర్ రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రజాఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. అనంతరం మండలంలోని ఉయ్యాలవాడ వద్ద సాయంత్రం 4 గంటలకు సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 4:50కి కల్వకుర్తి శివారులోని హైదరాబాద్ రోడ్డులో ఏర్పాటు హెలీప్యాడ్ వద్దకు చేరుకొని సాయంత్రం 4:55గంటలకు ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. అనంతరం 5:40గంటలకు అక్కడి నుండి హైదరాబాద్‌కు బయలు దేరనున్నారు. పట్టణ శివారులోని ఉయ్యాల వాడ వద్ద ముఖ్యమంత్రి పాల్గొననున్న ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. లక్ష మందికి సరిపడ ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. వాహనాల పార్కింగ్‌పై కార్యకర్తలతో చర్చించారు.

ఈవీఎం, వీవీప్యాట్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి శ్రీనునాయక్

కల్వకుర్తి: పట్టణంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీల నాయకులకు శనివారం ఈవీఎంలు, వీవీప్యాట్లపై అవగాహన కల్పించారు. ఎన్నికల నోటిఫికేషన్ సందర్భంగా ఈవీఎంలను మొదటి సారి రాండమైజేషన్ పూర్తి చేశారు. 2వ సారి అభ్యర్థులు వారికి సంబంధించిన శనివారం 2వ రాండమైజేషన్ పూర్తి చేశారు. కార్యక్రమానికి ఎన్నికల జనరల్ అబ్జర్వర్ తైతులాంగ్ పామయి హాజరయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీను నాయక్ రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేందుకు పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలని శ్రీను నాయక్ కోరారు.

అచ్చంపేట: శాసనసభ ఎన్నికల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. 30న జరిగే పోలింగ్ కోసం అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో శనివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈవీఎం, వీవీప్యాట్స్‌పై ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలించే విధానం, నంబర్ల ప్రకారం ఏ పోలింగ్ కేంద్రాలకు కేటాయించబడుతుందో పార్టీ ప్రతినిధులకు కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్‌లో అధికారులు వివరించారు. మొదటి విడత ర్యాండమైజేషన్ గతనెల 20న చేపట్టారు. ఈవీఎంలను ఈనెల29న పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పర్యవేక్షకులు సతీష్‌కుమార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపిరామ్, డీడీ రాములు, రేఖ, రాజేందర్, మంగ్యానాయక్, మల్లికార్జున్, గుద్దటి బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

తాడూరు: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు యారరమేష్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో సభ ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మశన్న, యార కృష్ణయ్య, శ్రీనివాసులు, చింతసత్తి, కురుమూర్తి పాల్గొన్నారు.

బాలుడికి గాయాలు

అమ్రాబాద్: మండలంలోని మాదవానిపల్లి గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ స్వాతి దంపతుల ఐదేళ్ల కుమారుడు అన్నుకు గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం గామానికి చెందిన అన్ను తోటి చిన్నారులతో కలిసి ఆడుకుంటుండగా బీఆర్ఎస్ ప్రచార రథం బాలుడిని తగిలింది. ఈ ఘటనలో బాలుడికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం బాలుడిని వెల్దెండ యెన్నం హాస్పిటల్‌కు తరలించారు.

కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని దాసర్లపల్లిలో శుక్రవారం సాయంత్రం గ్రామానికి చెందిన కంచర్ల శ్రీలత, ఆమె తల్లిదండ్రులపై దాయాదులైన కంచర్ల రామచంద్రయ్య, కృష్ణయ్య, శివశంకర్, చంద్రశేఖర్‌లు పొలం విషయంలో గొడవపడి దూషించి దాడి చేశారు. ఈఘటనలో శ్రీలతో పాటు ఆమె తల్లిదండ్రులకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పాన్‌గల్: ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా మండల ప్రజలు సహకరించాలని ఎస్ వేణు కోరారు. శని వారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆ యన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించి నా, వారి చర్యలపై అనుమానాలు వచ్చినా వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామన్నారు. అన్నారంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఐదు మంది యువకులు మద్యం సేవించి రోడ్డుపై ఇతరులకు విఘాతం కలిగించిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రాజ్యాంగంపై కేసీఆర్‌కు నమ్మకం లేదు

వెల్దండ: రాజ్యాంగంపై సీఎం కేసీఆర్‌కు నమ్మకం లేదని మాజీ ఎంపీ మంద జగన్నాథం పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబ పాలనతో ప్రజలు విసుకుచెందారన్నారు. ఎమ్మెల్యేలకు, మంత్రులకు కూడా సమస్యలు విన్నవించేందుకు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. కుటుంబ పాలనతో రాష్ట్రం అన్ని విధాలా నష్టం పోతుండటంతో పార్టీని వీడినట్లు ఆయన తెలిపారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్‌యాద్, మట్ట వెంకటయ్యగౌడు, వరప్రసాద్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ హామీలు నమ్మొద్దు



బిజినేపల్లి మండలం పెద్దతండాలో ప్రచారం నిర్వహిస్తున్న కూచుకూళ్ల రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి: తొమ్మిదేళ్లుగా పలు హామీలతో ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని వారి హామీలు నమ్మొద్దని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గంగారం, పెద్దతండా, కిమ్యాతండాలో ఆయన గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చి స్వయం ఉపాధి చూపించిందన్నారు. అదేవిధంగా లట్టుపల్లి గ్రామంలోని భద్యతండా, ఎర్రకుంటతండా, రావుల చెరువుతండాలలో రాజేష్ రెడ్డి సతీమణి కూచుకుళ్ల సరిత ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కూచుకుళ్ల సుహాసన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ హల్య టీజేఎస్ జిల్లా నాయకుడు శ్యాంసుదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో జెడ్పీటీసీ రోహిణి, ఎంపీటీసీ రేణుక, కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి తదితరులు కూచుకుళ్లకు మద్దతుగా ప్రచారం చేశారు. అదేవిధంగా మండలంలోని బలాన్‌పల్లిలో సీపీఐ నాయకుడు జైపాల్‌రెడ్డి ఇంటింటికి ప్రచారం చేశారు.

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్లను ఆదరించాలని ఓటర్లను కోరారు. ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు.

ఉపాధి కల్పనకు కృషి



కొల్లాపూర్‌లో బీజేపీలో చేరిన నాయకులు

కొల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆదరిస్తే నియోజక వర్గంలోని యువతకు ఉపాధి కల్పనకు కృషి చేస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. శనివారం నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాలు, తండాలకు చెందిన నాయకులు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఎల్లేని సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల తరపున పోటీలో ఉన్న అభ్యర్థులు కొల్లాపూర్ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. బీజేపీకి అధికారం ఇవ్వకపోయినా కొల్లాపూర్‌కు జాతీయ రహదారిని తీసుకొచ్చామన్నారు. ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే వంద పరిశ్రమలు నెలకొల్పేలా పాటుపడుతానన్నారు. అదేవిధంగా పట్టణంలో ఎల్లేని భారతి ఇంటింటి ప్రచారం చేశారు. పలు వార్డుల్లో ప్రజలను కలిసి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

పాన్‌గల్: నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఎల్లేని సుధాకర్‌రావు కోరారు. మండలంలోని కేతేపల్లిలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. యువత ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలన్నారు. రోజారమణి, అన్వేష్, రమేష్, నాయకులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

అమ్రాబాద్: విద్యార్థులు సేవ దృక్పథం అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కోరారం. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు కుమ్మరోనిపల్లి, అమ్రాబాద్ తదితర గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా చదువు, సామాజిక సేవలపై అవగాహన కల్పించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్ వివరాల ప్రకారం.. మండలంలోని చందుబట్ల గ్రామానికి చెందిన స్వరూపారాణి (21) వ్యక్తిగత కారణాలతో ఈనెల 14న ఇంట్లోనే హెయిర్‌డై కలర్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను జిల్లా కేంద్రంలోని జనరల్‌ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. శనివారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి ఆమె మృతిచెందింది. ఆమె తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

లింగాల: బతుకుదెరువు కోసం రెండు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని నాగోల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో లింగాలకు చెందిన శ్రీకాంత్(30) రోడ్డు దాటుతున్న సమయంలో వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. అతని భార్య కొన్ని నెలల క్రితం వదిలి వెళ్లిపోయింది.

బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం



ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

కొల్లాపూర్/పాన్‌గల్: బీఆర్ఎస్ పార్టీ ద్వారానే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆపార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కొల్లాపూర్‌లో హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో పెంట్లవెల్లి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షఫీఉల్లా, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫిరోజ్, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణప్రసాద్‌తో పాటు పలువురు, పాన్‌గల్ మండలం శాగాపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ సింగన్నయాదవ్, మాజీ సర్పంచ్ బలరాం నాయక్, సుధాకర్‌తో పాటు పలువురు, కొల్లాపూర్ పట్టణానికి చెందిన యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేశా. ప్రజలు దీన్ని గుర్తించారు. అందుకే బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలబడుతున్నారు అని చెప్పారు. గత పాలకులు అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఒక్కసారి పదవి కోల్పోయేసరికి దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. మళ్లీ ఎలాగైనా సరే పదవి దక్కించుకోవాలని రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారన్నారు. ఈకార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు కురువ విజయ్, రంగినేని అభిలాష్‌రావు, కాటగొని తిరుపతమ్మ ధరాసింగ్, సర్పంచ్ మౌనికయాదవ్, తిరుపతియాదవ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం..

కోడేరు: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, సర్పంచ్ వెంకటస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం వివిధ పార్టీ నుంచి 25మంది నాయకులు వారి సమక్షంలో చేరారు. కార్యక్రమంలో గడ్డం నర్సింహ, రాముడు, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని నక్కలపల్లి, గంట్రావుపల్లి, జొన్నలబొగుడ, కల్వకోలు గ్రామాల్లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

గ్యారంటీ పథకాలపై అవగాహన



విద్యానగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి మద్దతుగా శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని వివరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందన్నారు. దొరలపాలనకు, కుటుంబపాలనకు చరమగీతం పాడుదామని కోరారు. మండలంలోని తుర్కలపల్లిలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. పట్టణాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఖదీర్, రాహుల్ తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్, స్టిక్కర్ల పరిశీలన



డోర్ స్టిక్కర్ వేస్తూ ఓటరుకు అవగాహన కల్పిస్తున్న ఎంపీఓ వెంకటయ్య

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఓటరు స్లిప్ పంపిణీ, డోర్ స్టిక్కర్ల పనులను ఎంపీఓ వెంకటయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి భీముడుతో కలిసి గ్రామ ప్రధాన కూడళ్లలో పర్యటించారు. ఓటరు స్లిప్‌లు ఇంటి యజమాని సంబంధిత వ్యక్తులకు మాత్రమే ఇవ్వాలని గ్రామ సిబ్బందికి సూచించారు. ఇంటి వద్ద లేని వారికి ఓటరు స్లిప్‌లు ఓటింగ్ రోజు పోలింగ్ స్టేషన్ వద్ద నేరుగా వారికే అందజేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఎవరు కూడా అతిక్రమించరాదని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటించని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ, అంగన్‌వాడీ టీచర్ మంజుల, గ్రామ పంచాయతీ సిబ్బంది మల్లయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: ఓటర్‌స్లిప్‌లను విధిగా ఇంటి యజమానుకు అందించాలని డీఎల్‌పీఓ వెంకటయ్య పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో డోర్ స్టిక్కర్ల తొలగింపు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళిని అతిక్రమించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యా ప్రగతిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఆర్పీ రత్నశేఖర్

లింగాల: పాఠశాలలలో విద్యా ప్రగతిపై దృష్టి సారించాలని డీఆర్పీ రత్నశేఖర్ ఉపాధ్యాయులను కోరారు. శనివారం మండలంలోని అంబట్‌పల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం తాహెర్‌పాషా ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ వివిధ అంశాల గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల ప్రగతి, పాఠ్యబోధన, ప్రశ్నపత్రాల తయారీ, చదవడం, ఉన్నతి తదితర అంశాలపై, పదిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో సీఆర్పీలు సుబ్బయ్య, విష్ణు, కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.